క్లుప్తంగా

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారిని విశేషంగా అలంకరించి సుప్రభాత సేవ, తోమాల సేవ తదితర పూజలు జరిపారు. భక్తులు, అయ్యప్పమాలధారణ స్వాములు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు మైసన్నగూడెం గ్రామానికి చెందిన దొడ్డ సత్యనారాయణ, సీతామహాలక్ష్మి దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు. స్వామి వారి అలంకరణకు నులకాని రాజేష్, గాయత్రి దంపతులు దాతలుగా వ్యవహరించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా



తుప్పల్లో బోల్తా పడిన కారు

కుక్కునూరు: మండలంలోని అమరవరం, రాజీవ్‌నగర్ గ్రామాల మధ్య శనివారం ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుక్కునూరు నుంచి బూర్గంపాడు వైపు వెళ్తున్న కారు రాజీవ్‌నగర్, అమరవరం గ్రామాల మధ్య గల మలుపులో అదుపుతప్పి రోడ్డు పక్కన తుప్పల్లోకి బోల్తా కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఓ వ్యక్తి మాత్రమే ఉండగా అతనికి ఎటువంటి గాయాలు కాలేదని స్థానికులు చెప్పారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రిశత జయంతి (సీఎస్‌టీఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.కోటి నలభై లక్షలతో నిర్మించబోయే అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే రోషన్ కుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం జంగారెడ్డిగూడెం, కామవరపుకోట విద్యా కమిటీ చైర్మన్లు, సభ్యులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, తహసీల్దార్ కె.స్లీవజోజి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలం ఆక్రమణపై విచారణ

జంగారెడ్డిగూడెం రూరల్: అక్కంపేటలో పేదల ఇళ్ల స్థలానికి ఇచ్చిన భూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించినట్లు ఆర్డీవో అద్దయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల స్థలాలకు ప్రతిపాదించిన భూమిలో మధ్యలో గాడి తీసిన పేరాబత్తుల శ్రీనును తహసీల్దార్ వివరణ కోరినట్లు పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమి చదును చేయడం వల్ల వర్షం నీరు భూమిల్లోకి రావడంతో గాడి తవ్వినట్లు తహసీల్దార్ విచారణలో తేలిందన్నారు. పేరాబత్తుల శ్రీనుని గాడిని పూడ్చాలని ఆదేశించగా అతను గాడిని పూడ్చాడని, దారి ఎటువంటి ఆక్రమణలకు గురికాలేదని ఆర్డీవో అద్దయ్య పేర్కొన్నారు.

వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న సర్పంచ్ విజయదుర్గ

పోలవరం రూరల్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులు, నాయకులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పోలవరం పంచాయతీ పరిధిలోని రామయ్యపేటలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, సర్పంచ్ పోడుం పుష్ప, కొత్తపట్టిసీమ పంచాయతీలో సర్పంచ్ మైగాపుల విజయదుర్గ మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శ్రీనివాస్, కొణతాల ప్రసాద్, వనపర్తి చిన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, కార్యదర్శి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన కొండాబత్తుల సింహాచలానికి స్థానిక రాజారాణి కళ్యాణ మండపం సమీపంలో ఒక ఎకరం పొలం ఉంది. అదే ప్రాంతంలో సుమారు 7 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, సదరు భూములకు వెళ్లడానికి పుంత దారి ఉంది. ఈ దారిని గుడిదెల వెంకటేశ్వరరావు ఆక్రమించుకుంటుండగా, సింహాచలం ప్రశ్నించాడు. దీంతో వెంకటేశ్వరరావు కత్తితో దాడి చేయడంతో సింహాచలం గాయపడి స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం, సింహాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

కప్పలకుంటలో దారి దోపిడి

ద్వారకాతిరుమల: మండలంలోని కప్పలకుంట వద్ద శుక్రవారం రాత్రి దారి దోపిడీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం నుంచి బైక్‌పై భీమడోలు వెళుతున్న శాంతికుమార్ అనే వ్యక్తి కప్పలకుంట వద్ద ఆగి, మూత్ర విసర్జన చేస్తున్నాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై దాడిచేసి, అతడి చేతికి ఉన్న బంగారపు ఉంగరం, పర్సు, అలాగే సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు.

అక్కడే ఉన్నా పరిహారం అందదు

- ఆర్‌అండ్‌ఆర్ పరిహారంలో కాంటూరు అని, బ్లాక్ అని తేడాలు
- అందరికీ అందని ఆర్‌అండ్‌ఆర్ పరిహారం
- నిర్వాసితుల కొంప ముంచుతున్న సర్వే సౌలభ్యం
- గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పరిహారం ఇవ్వాలని వినతి



కుక్కునూరులో 41.15 కాంటూర్, 45 కాంటూర్ పరిధిలో ఉన్న ఒకే వీధిలోని ఎదురెదురు ఇళ్లు

కుక్కునూరు: అధికారుల సర్వే సౌలభ్యం కాస్తా నిర్వాసితుల కొంప ముంచుతోంది. కాంటూరు అని, బ్లాక్ అని అధికారులు చూపించిన తేడాలే ఇప్పుడు నిర్వాసితుల పాలిట శాపమవుతున్నాయి. అదే గ్రామంలో ఉన్నా వారికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం దక్కక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతి ఏడాది పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ముంపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిర్వాసిత గ్రామాల్లో పోలవరం పరిహారాన్ని బ్లాక్‌లతో సంబంధం లేకుండా గ్రామం మొత్తానికి ఒకేసారి ఆర్‌అండ్‌ఆర్ వ్యక్తిగత, ఇంటి విలువల పరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్ డ్యాం ఎత్తు 45.72 మీటర్లు కాగా డ్యాం ఎత్తు ఆధారంగా ప్రభుత్వం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 41.15, 45.72 కాంటూర్‌లో ముంపునకు గురయ్యే గ్రామాలను పరిహారం చెల్లించేందుకు గుర్తించింది. దానిలో భాగంగా 41.15 కాంటూర్ పరిధిలోని గ్రామాలకు పరిహారం చెల్లించి పునరావాస కాలనీలకు తరలించే పనులు జరుగుతున్నట్టు తెలుస్తుంది.

కుక్కునూరులో 41.15 పరిధిలో 8 గ్రామాలు

పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో కుక్కునూరు మండల పరిధిలో 8 గ్రామాలు ఉన్నాయి. కుక్కునూరు ఏ బ్లాక్, కివ్వాక, దామరచర్ల, చిరవెల్లి, బోనగిరి, గొమ్ముగూడెం, గుంపెనపల్లి, రామచంద్రాపురం గ్రామాలను 41 కాంటూర్ పరిధిలో అధికారులు గుర్తించారు. వీటిలో గత ప్రభుత్వ హయాంలో గొమ్ముగూడెం గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించారు. కాగా తక్కిన గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించాల్సి ఉంది.

ఒకే వీధికి చెందిన ఇళ్లు వేర్వేరు కాంటూరు పరిధిలోకి

2016వ సంవత్సరంలో ఆర్‌అండ్‌ఆర్ సర్వే నిర్వహించారు. సర్వే సౌలభ్యం కొరకు అప్పటి పీఓ ఆదేశాల మేరకు గ్రామంలోని ఇళ్లను అధికారులు ఏ, బీ, సీ బ్లాక్‌లుగా విభజించి జాబితాలను సిద్ధం చేశారు. అంతవరకు బాగానే ఉన్నా ఆ జాబితాలో ఏ గ్రామంలో అయితే ఏ బ్లాక్ కింద పేర్కొన్న ఇళ్లలు ఉన్నాయో వాటిని మాత్రమే 41 కాంటూర్ పరిధిలో చేర్చి పరిహారం చెల్లించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినట్టు తెలుస్తుంది. ఉదాహరణకు కుక్కునూరు గ్రామానికి సంబంధించి శివాలయం వీధిలో ఎదురెదురు ఇళ్లలో ఓ పక్క ఇళ్లలు ఏ బ్లాక్‌గా పేర్కొనడంతో వాటిని 41.15 కాంటూర్ పరిధిలో చేర్చి అదే వీధిలో ఎదురుగా ఉన్న ఇళ్లను బీ బ్లాక్ గా పేర్కొనడంతో వాటిని 45 కాంటూర్ పరిధిలో చేర్చారు. దీంతో ఒక వీధిలోని వారే ఒకేసారి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం తీసుకోలేని దుస్థితి. ఇదే విధంగా మాధవరం పంచాయతీలో చిరవెల్లి 41.15 కాంటూర్ పరిధిలో ఉండగా అదే పంచాయతీలోని కౌండిన్యముక్తి, మాధవరం గ్రామాలను 45 కాంటూర్ పరిధిలో చేర్చారు. ఈ విధంగా ఆర్‌అండ్‌ఆర్ జాబితాలు రూపొందించడంతో నిర్వాసితులు అంతా అయోమయంగా ఉందని వాఖ్యానిస్తున్నారు.

చట్టం ప్రకారం గ్రామం మొత్తాన్ని తరలించాలి

2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్ట్ కోసం భూసేకరణ జరిపినప్పుడు ఆ గ్రామానికి సంబంధించి 70 శాతం భూములు ప్రభుత్వం సేకరిస్తే ఆ గ్రామం మొత్తానికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలి. కాని ప్రభుత్వం పునరావాసం కల్పించడంలో పరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే బ్లాక్ లంటూ, కాంటూర్‌లంటూ కాలం వెల్లదీస్తుందని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం బ్లాక్‌లతో, కాంటూర్‌లతో సంబంధం లేకుండా మండల పరిధిలోని గ్రామాలన్నింటికీ ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించి పునరావాస కేంద్రాలకు తరలించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

గ్రామం మొత్తాన్ని యూనిట్‌గా పరిగణించాలి



కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా, బ్లాక్‌లతో సంబంధం లేకుండా మండలాన్ని లేక గ్రామాన్ని మొత్తం యూనిట్‌గా పరిగణించి ఆర్‌అండ్‌ఆర్ పరిహారాన్ని చెల్లించాలి.

– యర్నం సాయికిరణ్, సీపీఎం, కుక్కునూరు

మాకు పరిహారం అందించాలి



శివాలయం వీధిలో మా ఇళ్లు ఉంది. మా ఇంటి ఎదురుగా ఉన్న ఇళ్లు వరదకు మునిగితే మా ఇళ్లు కూడా వరదకు మునుగుతాయి. కానీ మా ఎదురుగా ఉన్నవాటిని ఏ బ్లాక్ గా పరిగణించి 41.15 కాంటూర్ పరిధిలో చేర్చారు. మా ఇంటిని బి బ్లాక్‌గా పేర్కొని 45 కాంటూర్ పరిధిలో పేర్కొన్నారు. మాకు కూడా వారితో పాటే ఆర్‌అండ్‌ఆర్ పరిహారాన్ని అందించాలి.

– తంగెళ్లపల్లి రవికుమార్, శివాలయం వీధి, కుక్కునూరు

రేషన్‌లో కందిపప్పు పంపిణీ

పోలవరం రూరల్: నవంబర్ నెలలో రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు కూడా అందజేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆర్ఎస్ రాజు తెలిపారు. మండలంలోని 14,700 రేషన్‌కార్డు దారులకు ఉచిత బియ్యంతో పాటు అరకేజీ పంచదార, కేజీ కందిపప్పు అందజేస్తామన్నారు.

చోరీకి యత్నించి విఫలం

పోలవరం రూరల్: తాళాలు వేసి ఉన్న ఇంట్లో ఓ దొంగ పట్టపగలు చోరీకి యత్నించి విఫలమయ్యాడు. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాలివి. ప్రగడపల్లి గ్రామంలో నరసారపు నాగేంద్ర అనే వ్యక్తి పనికి వెళ్లగా అతని భార్య శనివారం మధ్యాహ్నం ఇంటికి తాళం బయటకు వెళ్లింది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తాళం బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి బీరువా బద్దలు కొట్టేందుకు యత్నించాడు. సరిగ్గా ఆ సమయంలోనే నాగేంద్ర భార్య ఇంటికి వస్తున్న అలికిడి కావడంతో దుండగుడు పరారయ్యాడు. ఈ ఘటనలో ఏవిధమైన వస్తువులు చోరీకి గురికాలేదు.

ఎక్సైజ్ దాడులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తిరుమలాపురం, కేతవరం, పంగిడిగూడెం, లక్కవరం తదితర గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. తిరుమలాపురంలో నిర్వహించిన దాడిలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, జి.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన కొమ్ముకూరి బోడియ్య ఈ నెల 21వ తేదీ రాత్రి ఇంటి వద్ద తన మోటార్‌సైకిల్‌ను పార్క్ చేశాడు. మరో సటి రోజు తెల్లవారుజామున లేచి చూసేసరికి మోటార్‌సైకిల్ కనిపించలేదు. అప్పటి నుంచి మోటార్‌సైకిల్ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మద్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నేరంపై వేగవరం గ్రామానికి చెందిన కాగితాల వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించగా, వెంకటేశ్వరరావు తన కిరాణా కొట్టు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి రూ. 2090 విలువైన 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అశోక్‌నగర్ ప్రాంతంలో మండల పరిషత్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ గంజిమాల రామారావు శనివారం ప్రారంభించారు. రూ.4 లక్షలతో సిద్దార్థ స్కూల్ నుంచి పాదాలమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మిస్తామన్నారు. అలాగే మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్టా వనజా లక్ష్మి, ఎంపీటీసీలు ఘంటా శీనమ్మ, గంటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే జరిమానా, వాహనం సీజ్

ద్విచక్ర వాహనదారులకు హెచ్చరిక



అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ యు.రవిచంద్ర, ఆర్టీవో ఎండీ మదని

జంగారెడ్డిగూడెం: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే వాహనం నడపాలని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం హెల్మెట్ ధారణపై పోలీసు, రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది తలకు బలమైన గాయాలు కావడం వల్లే మృత్యువాత పడుతున్నారన్నారు. కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. విలువైన ప్రాణాలు కాపాడుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉందని ప్రజలకు సూచించారు. ఆర్టీవో ఎండీ మదని మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రధాన కూడళ్ల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరైతే హెల్మెట్ లేకుండా వస్తారో వారికి రూ.1000 జరిమానా విధిస్తామని, జరిమానా చెల్లించేంత వరకు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వి.కృష్ణబాబు, ఎస్సై షేక్ జబీర్, ఎంవీఐ ఎస్ఎస్ రంగనాయకులు, ఏఎంవీఐ పీబీ సురేష్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై పి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



ఆమోస్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జెట్టి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: చొప్ప రామన్నగూడెం వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త యడ్లపల్లి ఆమోస్ నిబద్ధత, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలిచారని ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు పేర్కొన్నారు. ఆమోస్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. ఆమోస్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని, పార్టీ అండగా నిలబడుతుందని భరోసా కల్పించారు. గవరవరం గ్రామ కన్వీనర్ సీమకుర్తి సత్యనారాయణ, తగరం వినోద్, కసుకుర్తి వేణు, గంటా రమేష్, బొమ్మ రామకృష్ణ, బొబ్బిలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా బూరుగువాడ రోడ్డు నిర్మాణ పనులు



కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు (ఫైల్)



బూరుగువాడలో ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.7 కోట్ల 45 లక్షల నిధులు మంజూరు
- నాడు పనులు ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన బూరుగువాడ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రహదారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ నిధులతోనే రహదారి నిర్మాణం పనులు చేస్తున్నారు. బుట్టాయగూడెం శివాలయం సమీపం నుంచి దొరమామిడి మీదుగా బూరుగువాడ వరకూ రహదారి అధ్వానంగా తయారై ప్రజలు అనేక అవస్థలు పడుతున్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శివాలయం నుంచి బూరుగువాడ వరకూ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.7 కోట్ల 45 లక్షల నిధులు కేటాయించారు. 2023 డిసెంబర్ 22వ తేదీన స్థానిక శివాలయం వద్ద కొబ్బరికాయ కొట్టి తెల్లం బాలరాజు పనులను ప్రారంభించారు. ఆ సమయంలో శివాలయం నుంచి దొరమామిడి వరకూ రోడ్డు నిర్మాణం పనులు కూడా పూర్తి చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ పనులను కాంట్రాక్టర్ దొరమామిడి నుంచి బూరుగువాడ వరకూ పూర్తి చేస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలి



బుట్టాయగూడెం సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ నియామకాలను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ, నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలోని సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవ్వా బసవరాజు, సర్పంచ్ కుంజా వెంకటేశ్వరరావు, తెల్లం వెంకటేశ్వరరావు, సరియం చల్లయ్య, ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సోదెం ముక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు గండ్లు.. రైతులకు అవస్థలు







ఇసుక కాలువ గట్టుకు గండి పడి పొలాల మధ్య నుంచి ప్రవహిస్తున్న నీరు, తానాలకుంట చెరువుకు పడిన గండి, ఇసుక మేటలు వేసిన పొలం

పోలవరం రూరల్: ప్రతి ఏటా వర్షాకాలంలో కొండవాగులు పొంగి ప్రవహించడం, కాలువ గట్లకు గండ్లు పడుతుండటంతో రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇసుక కాలువ గట్టుకు 8 గండ్లు, మంగపతి బోదె గట్టుకు ఒక గండి, తానాలకుంట గట్టుకు ఒకటి, పాపాయమ్మ ట్యాంక్ సర్‌ప్లస్‌కు ఒకటి, పేద్రాల కాలువ గట్టుకు ఒకటి గండ్లు పడ్డాయి. దీంతో వాగులు పొంగి ప్రవహించినప్పుడల్లా నాట్లు వేసిన పంట పొలాలు ముంపునకు గురికావడం పరిపాటిగా మారింది. వేలకు వేలు ఖర్చుచేసి, నాట్లు వేసి, పొలాలు పచ్చగా ఉన్నాయనుకునే సమయంలో గండ్లు పడి పొలాలు ఇసుక మేటలు వేయడమే కాక, రాళ్లు కూడా కొట్టుకుని పచ్చని పొలాలు ఇసుక పొరలుగా ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక పొలాల్లోకి నీరు జాలుపడి కాలువ నీరంతా పొలాల మధ్య నుంచి ప్రవహిస్తోంది. కాలువ గట్లకు పలు చోట్ల గండ్లు పడటం, ఆ ప్రాంతంలోని పొలాలన్నీ ఇసుక మేటలు పెట్టడంతో రైతులు ఇసుక మేటలు తొలగించుకునే పరిస్థితి లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాలువ గట్లకు పడిన గండ్లకు తాత్కాలిక పనులు కూడా చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. ఇసుక బస్తాలు, తడికలు, బాధులతో గండ్లు పూడ్చేపనులు చేపట్టినా, మరలా కాలువలు పొంగితే వాటి ఉద్ధృతికి వేరొక చోట్ల గండ్లు పడుతున్నాయని తెలిపారు. ఇసుక కాలువ మొత్తం కాలువ వెడల్పు చేసి లోతు తవ్వి గట్టు పటిష్టపరిస్తే తప్ప ఈ కష్టాలు తప్పవని, శాశ్వత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గండ్లు పూడ్చే విషయంపై మైనర్ ఇరిగేషన్ డీఈ కె.వరప్రసాద్‌ను అడగ్గా గండ్లు పనులు చేపట్టేందుకు రూ.56 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే గండ్లుపూడ్చే పనులు చేపడతామన్నారు.

శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలి



ప్రతి ఏటా వర్షాకాలంలో కొండవాగులు పొంగి ప్రహించి ఇసుక కాలువకు గండ్లు పడుతున్నాయి. ఆ గండ్లు పూడ్చకపోవడంతో నాట్లు వేసిన పొలాలు కూడా దెబ్బతినడమే కాక, ఆ ప్రాంతంలో పొలమంతా ఇసుక మేటలు, రాళ్ల మయంగా మారుతోంది. కాలువ గండ్లు పూడ్చే పనులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలి.

– కోరసిక శ్రీను, రైతు, పోలవరం

గండ్లు పూడ్చడం లేదు



ఏళ్లు గడుస్తున్నా గండ్లు పూడ్చకపోవడంతో కాలువలు పొంగి ప్రవహించినప్పుడల్లా నీరంతా పొలలపై పడి ముంపునకు గురవుతున్నాయి. అంతేగాక ఇసుక మేటలు కూడా వేస్తున్నాయి. కాలువ మొత్తం వెడల్పు చేసి లోతు తవ్వి పటిష్టపనులు చేపడతే తప్ప రైతులకు శాశ్వత పరిష్కారం దొరకదు.

– పన్నూరి నరసింహారావు, రైతు, పోలవరం

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ద్వారకాతిరుమలలో ప్రమాణస్వీకారం చేస్తున్న యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం

ద్వారకాతిరుమల: ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను పూర్తిగా తగ్గించి, బోధనకు సమయం ఉండేలా ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు కోరారు. ద్వారకాతిరుమలలోని యూటీఎఫ్ భవనంలో శుక్రవారం రాత్రి ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ స్వర్ణోత్సవాలు, నూతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా బి.జయరాజు, ప్రధాన కార్యదర్శిగా కట్టా శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా పి.వరప్రసాద్, సహాధ్యక్షుడిగా పాడుదోలు రాంబాబు, మహిళా సహాధ్యక్షురాలిగా డి.తులసి వరలక్ష్మి, కోశాధికారిగా కలకొండ చినబాబు, కార్యదర్శులు ఎన్నికయ్యారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం



మఠంగూడెంలో మహిళలకు కుట్టుమెషీన్లు అందజేసిన దృశ్యం

లింగపాలెం: మఠంగూడెంలో లెనిన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు శనివారం ఉచితంగా కుట్టుమెషీన్లు పంపిణీ చేశారు. సేవా సంస్థ ద్వారా రెండు నెలల పాటు శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ టీం సభ్యులతో పాటు గ్రామ అధ్యక్షుడు జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.